క్లుప్తంగా

సెంచూరియన్ విద్యార్థికి అభినందనలు



తేజవర్మను అభినందిస్తున్న వీసీ పీకే మహంతి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో సీఎస్‌ఈ చదువుతున్న విద్యార్థి గాదిరాజు తేజ వర్మను వీసీ పీకే మహంతి, సిబ్బంది గురువారం అభినందించారు. తేజవర్మ ఇటీవల పరిశోధన ట్రాన్స్‌ఫర్ లెర్నింగ్‌ను ఉపయోగించి మెరుగైన రొయ్యల గుర్తింపు, వ్యాధి వర్గీకరణ అనే అంశానికి సంబంధించి పీహెచ్‌డీ లభించింది. ఈ నేపథ్యంలో విద్యార్థిని ఘనంగా సత్కరించారు.

జ్ఞానజ్యోతులు పుస్తకావిష్కరణ



జ్ఞానజ్యోతులు పుస్తకావిష్కరణ చేస్తున్న నారంశెట్టి, తదితరులు

విజయనగరం టౌన్: బాల నాటికలు నేటి కాలంలో విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జక్కు రామకృష్ణ రచించిన జ్ఞానజ్యోతులు బాల నాటికలు పుస్తకావిష్కరణ సభ సన్‌స్కూల్ ఆవరణలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటికలు ప్రదర్శనకు అనుకూలంగా ఉన్నాయన్నారు. నీతి, న్యాయం, ధర్మం, కర్తవ్యం బోధించేవిగా ఉన్నాయన్నారు. సన్ స్కూల్ డైరెక్టర్ ఎమ్.అనిల్ కుమార్, నెల్లిమర్ల ఎంఈఓ ఈపు విజయకుమార్, బి.సూర్యలక్ష్మి, నారాయణ మూర్తి, శ్రీరామూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి : డీఎస్పీ

బొబ్బిలి: రోడ్లపై వాహనాలు నడిపేవారు భద్రతా నియమాలు పాటించాలని డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం పట్టణంలోని పాత బొబ్బిలి జంక్షన్ వద్ద వాహనదారులను నిలిపి వారికి పలు సూచనలు చేశారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. లైసెన్స్‌లు, ఇన్సూరెన్స్ పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. వాహనదారులు తమ కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకుని ప్రయాణాలు చేయాలన్నారు. ట్రాఫిక్ ఎస్‌ఐ వి.బలరామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వేతనదారులు తస్మాత్..

రాజాం: ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో ఉపాధి పనులు చేయవద్దని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ మీసాల శ్రీనివాసరావు వేతనదారులకు సూచించారు. మండలంలోని మొగిలివలస గ్రామంలో పెంటవాని చెరువులో జరుగుతున్న ఉపాధి పనులు గురువారం పరిశీలించారు.

ప్రజలు వివాదాలకు పాల్పడొద్దు

వంగర: గ్రామాల్లో ప్రజలు వివాదాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ వై.వి.జనార్దన్ కోరారు. మండల పరిధి కోనంగిపాడు గ్రామంలో ప్రజలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల వేళ ప్రజలు సోదర భావంతో మెలగాలని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు సిద్ధం

బొబ్బిలి: వైఎస్సార్ సీపీ బొబ్బిలి అభ్యర్థి శంబంగి వెంకట చిన అప్పలనాయుడు గెలుపునకు తామంతా సిద్ధంగా ఉన్నామని 41, 56 బూత్‌ల ప్రజలు నాయకులు అన్నారు. జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వరరావు(విసు)ఆధ్వర్యంలో గురువారం బూత్ లెవెల్‌లో సమావేశాలు, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేసిన కౌన్సిలర్ చోడిగంజి అనసూయ ప్రజలకు వైఎస్సార్ సీపీ సంక్షేమ పథకాలను వివరించారు.

వార్డుల్లో వైఎస్సార్ సీపీ ప్రచారం



ఆదర్శనగర్‌లో ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాజాం: పట్టణంలోని ఆదర్శనగర్, మల్లయ్యపేట, అమ్మవారికాలనీ తదితర వార్డుల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రచారం గురువారం నిర్వహించారు. పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్యలు ప్రచారం నిర్వహించారు. పార్టీ రాజాం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్‌ని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ఓటర్లును కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పాలవలస గోపి, పార్టీ నాయకులు దూబ గోపాలం, ఆర్నేపల్లి వెంకట నాయుడు, జేసీబీ శ్రీను, వెంపల లక్ష్మణరావు, యందవ చినబాబు, సత్యనారాయణ, గోకవలస బాబూరావు, వై.జయరాం మాస్టరు, కొల్లా రమ్య, యందవ సునీల, కెల్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక పాలనను
మరోసారి ఆశీర్వదించండి



గాజులరేగలో పురవీధుల్లో ప్రచారంలో కోలగట్ల వీరభద్రస్వామి

- ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- నగరంలోని గాజులరేగ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం

విజయనగరం: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పారదర్శక పాలన సాగించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని, నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పని చేసిన తనను రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. నగరంలోని 49వ డివిజన్ గాజులరేగ ప్రాంతంలో ఎన్నికల ప్రచారాన్ని గురువారం నిర్వహించిన ఆయనకు స్థానికులు బ్రహ్మరథం పట్టారు. ముందుగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికి పూలమాలలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ఆయన ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికల్లో తమ ఓటు హక్కును ఫ్యాన్ గుర్తుపై వేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మద్దతు తెలియజేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ప్రజలు కూడా కోలగట్లకు హారతులు, కుంకుమ పెట్టి నిండు మనస్సుతో ఆశీర్వదించారు. అనంతరం నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణలు మాట్లాడుతూ అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్న వ్యక్తులనే గెలిపించాలని తద్వారా నియోజకవర్గం మరింత అభివృద్ధి దిశగా పయనించేందుకు అవకాశం ఉంటుందని ఓటర్లను అభ్యర్థించారు. మరోసారి శాసనసభ్యులుగా కోలగట్ల వీరభద్ర స్వామికి అవకాశాన్ని ఇస్తే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతారని హామీ ఇచ్చారు. గాజులరేగతో పాటు నగరంలోని అన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్య లేకుండా రోజు విడిచి రోజు నీటి పంపిణీ జరిగే విధంగా ప్రణాళిక బద్ధంగా కృషి చేశారన్నారు. ఓవైపు అభివృద్ధి మరోవైపు నగర సుందరీకరణకు పాటుపడడం వల్ల నగరం అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా పయనించిందని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనతో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. ప్రజలందరూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మరోసారి ఓటు ద్వారా ఆశీర్వాదాలు అందించాలని కోరారు. జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మన్యాల కృష్ణ, 50వ డివిజన్ కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు కణుగుల రాజా, నగర ప్రధాన కార్యదర్శి జమ్మాన శ్రీనివాసరావు, జమ్ము మధు, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల గుండె చప్పుడు సీఎం జగన్



కోనాడలో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలుపుతున్న మహిళలు

- బడ్డుకొండ ప్రచారానికి ప్రజల బ్రహ్మరథం

పూసపాటిరేగ: పెత్తందారులు, పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధంలో ప్రజలు గుండె చప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని కోనాడ, బొడ్డుగురయ్యపేట, బొడ్డు వెంకటేషుపేట గ్రామాలలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారాన్ని గురువారం నిర్వహించారు. మహిళలు, వృద్ధులు, యువత అడుగు అడుగునా బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో చేకూరిన లబ్ధిపై ఇంటింటికి వెళ్లి వివరించి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రచారంలో హారతులు ఇచ్చి స్వాగతం పలుకుతుంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై వారికున్న విశ్వాసం అర్థమై రెట్టింపు ఉత్సాహం వస్తుందన్నారు. పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి హృదయాలలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. తమ ప్రభుత్వ కాలంలో మీకు మేలు జరిగితే ఓటు వేయాలని అని ధైర్యంగా చెప్పిన వ్యక్తి జగనన్నేనని పేర్కొన్నారు. రాబోయే వైఎస్సార్‌సీపీ నూతన ప్రభుత్వంలో గతంలో కంటే మెరుగైన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు చూడబోతున్నారన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి కందుల రఘుబాబు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి జనార్ధనరావు, అల్లాడ రమేష్, ఎన్.సత్యనారాయణరాజు, రౌతు శ్రీరాంమూర్తి, అమర గురువులు, దాడిశెట్టి త్రినాధరావు, బొడ్డు ఉదయ భారతి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా పని చేద్దాం..



కార్యక్రమంలో మాట్లాడుతున్న యువజన విభాగం నాయకులు ఈశ్వర్‌కౌశిక్

విజయనగరం రూరల్: సంక్షేమ సారథి, అభివృద్ధి ప్రదాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకునేందుకు వైఎస్సార్ యువజన విభాగం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని యువజన విభాగం జిల్లా నాయకులు జి.ఈశ్వర్‌కౌశిక్, విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని బియ్యాలపేట గ్రామంలో వైఎస్సార్ యువజన విభాగం ఆధ్వర్యంలో యువజన విభాగం కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌కౌశిక్, మామిడి అప్పలనాయుడులు మాట్లాడుతూ ఐదేళ్ల జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. ఒకపక్క ప్రకృతి సహకరించడం, మరోపక్క ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలు అందిస్తునే, అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ప్రజల గడప వద్దకే సేవలు అందించారన్నారు. విద్య, వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ముఖ్యమంత్రికి దక్కుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్ష కూటమి అబద్ధపు ప్రచారానికి తెరతీసిందన్నారు. వీటిని తిప్పికొట్టాల్సిన బాధ్యత యువజన కార్యకర్తలపై ఉందన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అంపశయ్యపై ఉందని, అందుకే మూడు పార్టీల కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని కొత్తపుంతలు తొక్కించిన స్థానిక శాసనసభ్యులు కోలగట్ల వీరభద్రస్వామి గెలుపు ఖాయమని, గతం కంటే ఎక్కువ మెజార్టీ సాధించే వరకు విశ్రమించరాదన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, యువజన విభాగం నాయకులు కోరాడ రవి, పరుశురామ్, పార్టీ నాయకులు సత్తిరాజు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలకు సిద్ధం



ఉగాది విశేషాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న టీటీడీ పోగ్రామింగ్ కోఆర్డినేటర్ శ్యామ్‌సుందర్ తదితరులు

విజయనగరం టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో మనగుడిలో భాగంగా ఈ నెల 9న మంగళవారం క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు టీటీడీ ప్రోగ్రామింగ్ కోఆర్డినేటర్ జె.శ్యామ్ సుందర్ గురువారం తెలిపారు. ఈ మేరకు టీటీడీ ఆవరణలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది పర్వదినం పురస్కరించుకుని టీటీడీ ఆవరణలో బ్రహ్మశ్రీ రాళ్లపల్లి రామసుబ్బారావుతో పంచాంగ శ్రవణం, అనంతరం ఉగాది పచ్చడి వితరణ చేస్తామన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో గరుగుబిల్లి మండలం దళాయివలస శ్రీరామాలయంలో పొందూరు సుధాకుమార్‌తో పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో అర్చకులు పీవీ నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే పర్యావరణ పరిరక్షణ



కొండగుంపాం ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెచ్‌ఎమ్ వి.వేణుగోపాల్ అన్నారు. మండలంలోని కొండగుంపాం గ్రామంలో విద్యార్థులతో కలిసి పర్యావరణ పరిరక్షణపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే మానవాళికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రత్యేక రోజుల్లో డబ్బును వృథా చేయకుండా పర్యావరణానికి మేలు చేకూర్చే పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బూడివీధిలో పారిశుద్ధ్య లోపం

పూసపాటిరేగ: స్థానిక బూడివీధిలో మురుగు కాలువలో చెత్తాచెదారాలు పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీలో మురుగునీరు సక్రమంగా ప్రవహించకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని పలువురు కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అపారిశుద్ధ్యం నిర్మూలించాలని కోరుతున్నారు.

మండల సమావేశం వాయిదా

విజయనగరం రూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీఓ గంటా వెంకటరావు గురువారం తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశానికి సభ్యులెవరూ రాకపోవడంతో గంట పాటు వేచి చూసిన అధికారులు ఉదయం 11.30 గంటలకు వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

సజావుగా పింఛన్ల పంపిణీ

విజయనగరం రూరల్: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో బుధవారం నుంచి ప్రారంభమైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం రెండు రోజూ సజావుగా సాగింది. టీడీపీ ఫిర్యాదుతో వలంటీర్లతో పింఛన్ల పంపిణీని అడ్డుకున్నా... ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన గ్రామ సచివాలయాల్లో ఉద్యోగులు పింఛన్ల పంపిణీలో చురుగ్గా పాల్గొన్నారు. రెండు రోజుల్లో 5561 మంది పింఛనుదారులకు పింఛన్లు అందించారు. మరో 536 మందికి పింఛన్లు అందించాల్సి ఉంది.

వైకుంఠ నారాయణునికి పూజలు



రామనారాయణంలో దేవతామూర్తులకు అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో వైకుంఠ నారాయణునికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయం అర్చకులు చాణక్య, శ్రీహర్ష ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠ నారాయణునికి వేదమంత్రాల నడుమ స్నపనం, అర్చన, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఉత్సవంలో ఎన్‌సీఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, మేనేజర్లు శ్రీనివాసరాజు, ఎంవీ రమణ, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం

మండల పరిధి, దుప్పాడ గంగానగర్‌లోని శ్రీక్షేత్రమ్‌లో కొలువై ఉన్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరుని దేవాలయంలో శ్రీనివాస కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, శ్రీనివాస రమేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో శ్రీనివాసునికి ప్రత్యేక పూజలతో పాటు, కనులపండువుగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

చంద్రబాబు కుట్రలతో వృద్ధులకు అవస్థలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: చంద్రబాబు కుట్రలతోనే వృద్ధులు, దివ్యాంగులు తదితర పింఛన్‌దారులు అవస్థలు పడుతున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. మండల పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లుగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్ వ్యవస్థపై విషం కక్కుతూ వారిపట్ల చంద్రబాబు సైంధవుడుగా మారాడన్నారు. చంద్రబాబు స్వార్థ ప్రయోజనాల కోసం చేస్తున్న కుట్ర రాజకీయాల వల్ల వలంటీర్లను విధుల నుంచి తప్పించడంతో నాలుగున్నరేళ్లకు పైగా సజావుగా సాగిన ఇంటింటికీ పింఛన్ల పంపిణీ ఆగిపోయిందని, దీని వల్ల లక్షల మంది అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతు అక్కాచెల్లెమ్మలు మండుటెండల్లో రోడ్డున పడాల్సిన పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. పేదలంటే చంద్రబాబుకు ఎంత వ్యతిరేకత ఉందో స్పష్టమవుతోందని, ఏం చేసినా, ఎన్ని కుట్రలు పన్నినా వలంటీర్ వ్యవస్థను ఏమి చేయలేరన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయం

గత ఎన్నికల్లో అఖండ విజయం సాధించి అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ఈ ఎన్నికల్లో కూడా మరోసారి ప్రభంజనం సృష్టించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.మానవత్వం లేని చంద్రబాబు ప్రజలలో విశ్వసనీయత కోల్పోయారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరో చారిత్రక విజయాన్ని నమోదు చేయడం ఖాయమని జోస్యం చెప్పారు. ఆయన వెంట ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, మండల పార్టీ అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు, పాల సొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయలు, మండల ఉపాధ్యక్షుడు దర్రు పైడిరాజు, కటికి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రచారం

బాడంగి: మండలంలోని కోడూరు, బాడంగి గ్రామాలలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు శంబంగి వెంకటచినఅప్పలనాయుడు, బెల్లాన చంద్రశేఖర్ ఎన్నికల ప్రచారం శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మినాయుని వెంకటనాయుడు తెలిపారు. ఉదయం కోడూరు, మధ్యాహ్నం బాడంగిలో ప్రచారం చేయనున్నట్టు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ముగిసిన ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

రేగిడి: మండలంలోని చిన్నపుర్లి గ్రామంలో మూడు రోజులుగా నిర్వహించిన చిన్మయి సమేత చిదంబరీశ్వస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారంతో ముగిసాయి. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు ఈ ప్రతిష్ఠ ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. స్థానిక ఎంపీటీసీ కురిటి రామకోటి, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీసాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ



పల్లకిసేవలో భాగంగా బాబాను ఊరేగిస్తున్న భక్తులు

డెంకాడ: మండలంలోని పినతాడివాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన సాయిబాబా మందిరంలో షిర్డీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. దీంతో పాటు ఆలయంలో షిరిడిసాయి, సత్యసాయి చిత్రపటాలను ఆవిష్కరించారు. బాబా పుష్పమాలాంకరణ, నామసంకీర్తన పూజలు జరిగాయి. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో దివ్యమంగళ హారతి, ప్రసాద వితరణ జరిగాయి. సాయంత్రం బాబా పల్లకిసేవ జరిగింది. దీంతో భాగంగా భక్తులు, గ్రామస్తులు బాబాను పల్లకిలో గ్రామంలో ఊరేగించారు. కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా మారింది. భక్తుల బాబా నామస్మరణలతో మారుమ్రోగింది.

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



డెంకాడ: చలివేంద్రాలను ప్రారంభించిన వ్యవసాయ శాఖ

డెంకాడ: వేసవి తాపంతో పాటు విపరీతమైన వడగాల్పుల దృష్ట్యా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయాధికారి వి.తారకరామారావు తెలిపారు. ఈ చలివేంద్రాలు మండలంలోని సాయికృష్ణ రైతుమిత్ర గ్రూప్, డెంకాడ సత్యరాజ్ ఎంటర్‌ప్రైజెస్, మోపాడ ఎరువుల దుకాణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటిని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు నాగభూషణరావు, ఏవో పి.నిర్మల, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది జగనన్న సంక్షేమ ప్రభుత్వమే



సంతకవిటి: శ్రీహరినాయుడుపేటలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

సంతకవిటి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని, మళ్లీ జగనన్న సంక్షేమ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని శ్రీహరినాయుడుపేట, కృష్ణంవలస, గోళ్లవలస, కే.ఆర్.పురం, యం.ఆర్.అగ్రహారం, ఎస్.అగ్రహారం, జావాం, కొండగూడేం, మాధవరాయపురం గ్రామాలలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లి 58 నెలల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. పలువురు వృద్ధులు, దివ్యాంగులను ఆప్యాయంగా పలకరించారు. ఈ సంక్షేమ ప్రభుత్వం మళ్లీ రావాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబుకు మా ఉసురు తగులుతుంది

ఇంటింటి ప్రచారంలో భాగంగా గురువారం సాయంత్రం కృష్ణంవలస గ్రామంలో పర్యటిస్తున్న రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్, పింఛన్ కోసం లైన్లో నిల్చున్న లబ్ధిదారుల దగ్గరకు వెళ్లి పింఛన్ కోసం ఆరా తీయగా, లబ్ధిదారులు బాధతో మాట్లాడుతూ చంద్రబాబుకు మా ఉసురు తగులుతుందని విలపించారు. నియోజకవర్గ పరిశీలకుడు కేవీ సూర్యనారాయణరాజు, గండ్రేటి కేసరి, జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు, వైస్ ఎంపీపీ పండు పాపారావు, గోళ్లవలస సర్పంచ్ దాసరి దాలినాయుడు, ఎంపీటీసీ టంకాల కాశి, కె.ఆర్.పురం సర్పంచ్ పండు రాజగోపాలరావు, కృష్ణంవలస సర్పంచ్ గండ్రేటి సురేష్, కొండగూడేం సర్పంచ్ కె.వి.నాయుడు, ఎంపీటీసీ కె.అప్పారావు, సర్పంచ్‌లు వి.రమణ, మొయ్యి మోహన్, పప్పల ఈశ్వరరావు, నునగొప్పల ఈశ్వరరావు, ఎంపీటీసీలు కనకల సన్యాసినాయుడు, యినమల మురళికృష్ణ, వి.శ్రీనివాసనాయుడు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.